క్లుప్తంగా

మాజీ ఎంపీని కలిసిన మంత్రులు



సురేందర్‌రెడ్డిని సత్కరించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఖమ్మంవన్‌టౌన్: మాజీ పార్లమెంట్ సభ్యుడు, ఖమ్మం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి తండ్రి సురేందర్‌రెడ్డిని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నూకల నరేష్‌రెడ్డి, కార్పొరేటర్ కమర్తపు మురళి, సాధు రమేష్‌రెడ్డి, రావూరి సైదుబాబు, తుపాకుల యలగొండల స్వామి, చావా నారాయణరావు, వల్లపు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్ మృతికి సంతాపం

తిరుమలాయపాలెం: మండల మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్ కొప్పుల అశోక్ మాతృమూర్తి, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు కొప్పుల ప్రమీల (64) గురువారం మృతి చెందారు. ఈమేరకు కాంగ్రెస్ జిల్లా నాయకురాలు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, టీడీపీ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ కొండబాల కరుణాకర్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గులగట్టు ఎల్లయ్యతో పాటు చిలకపత్తిని కనకయ్య, బీజే క్లైమెంట్, కమ్మకోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయులు తదితరులు నివాళులర్పించారు.

నర్సరీ నెట్‌షెడ్‌కు మంటలు

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన పుచ్చకాయల బాబుకు సంబంధించిన నర్సరీ నెట్‌షెడ్‌కు గురువారం మంటలు అట్టుకుని కాలిపోయింది. మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నర్సరీ సమీపంలో చెత్తకు నిప్పు పెట్టడంతో గాలికి మంటలు వేగంగా వ్యాప్తించి నెట్‌షెడ్‌కు అంటుకున్నాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి ఫైరింజన్‌తో సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఏడాది మార్చిలో కూడా ఇదే నర్సరీ నెట్‌షెడ్‌కు మంటలు తాకి కాలిపోవడంతో గ్రామానికి చెందిన వారే కావాలని కుట్రతో మంట పెడుతున్నట్లు బాధిత రైతు ఆరోపించారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలికి గాయాలు

నేలకొండపల్లి: విద్యుదాఘాతంతో ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని చెన్నారం డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్దఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పరిసర ప్రాంతాల ఇళ్లలో షాక్ వస్తోందని సమాచారం. ఈనేపథ్యాన కాలనీకి చెందిన తోళ్ల యల్లమ్మ గురువారం కరెంట్ షాక్‌కు గురికాగా, తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సరైన ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్‌ను నమ్మరు..



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్రాన్ని పదేళ్ల పాటు పాలించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలేరని రైతు ఆత్మహత్యల నివారణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంజీరాల రాజేష్ అన్నారు. గురువారం ఖమ్మంలోని కస్బాబజార్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్‌కు తెరలేపాయని ఆరోపించారు. రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని, ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డిని ఎంపిక చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో గందె కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని హార్వెస్ట్ టెండర్ రూట్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని పోలీస్ కమిషనర్ సతీమణి నిష్ఠ సునీల్‌దత్, హార్వెస్ట్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆర్.పార్వతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి కాలంలో చిన్నారులకు ఏసీ గదుల్లో ఎంతో ఉపయోగకరమైన ఆటపాటలతో కూడిన పలు రకాల శిక్షణలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టెండర్ రూట్స్ హెచ్‌ఎం అసిమా, అకాడమిక్ ఇన్‌చార్జ్ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఉపాధి..!

ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న చెరువు పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలు కూడా అధిక సంఖ్యలో హాజరవుతుండడంతో జన జాతరలా చెరువు ప్రాంతాలు కనిపిస్తున్నాయి. ఇన్నాళ్లు పంట భూముల సాగు, వరద కాల్వల నిర్మాణాలు, ముళ్లపొదల తొలగింపు పనులు చేపట్టిన అధికారులు ప్రస్తుతం చెరువులలో నీరు లేకపోవడంతో పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో కూలీలు 'ఉపాధి' పొందుతుండగా.. చెరువు మట్టి తక్కువ ధరకే లభించడంతో రైతులు తమ పొలాలకు తోలించుకుంటున్నారు.

– తిరుమలాయపాలెం



బచ్చోడులో చెరువు పూడికతీత పనుల్లో పాల్గొన్న కూలీలు

ముమ్మరంగా సాగుతున్న చెరువుల పూడికతీత పనులు

- కూలీలకు ఉపాధి.. రైతులకు మేలు
- జన జాతరలా చెరువు ప్రాంతాలు
- మండలవ్యాప్తంగా ప్రతీ రోజు 5,500 మంది హాజరు
- ఎండ తీవ్రత దృష్ట్యా కూలి పెంచాలని వేడుకోలు

పూడికతీత పనులకు ప్రాధాన్యం..

తిరుమలాయపాలెం మండలంలోని 40 గ్రామ పంచాయతీలు ఉండగా.. అన్ని గ్రామపంచాయతీలలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో అత్యధికశాతం చెరువు పూడికతీత పనులకు ప్రాధాన్యమిస్తుండగా.. ప్రతీ రోజు మండలవ్యాప్తంగా 5,500 మంది కూలీలు హాజరవుతుండడం విశేషం. ఎంతో సారవంతమైన చెరువు మట్టి ఉపాధి పనులతో తక్కువ ధరకే లభిస్తుండడంతో పాటు పంటలకు కావాల్సిన అన్ని పోషకాలు ఉండడంతో రైతులు సొంత ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని తమ పంట పొలాలకు తరలిస్తున్నారు. ఈ పూడికతీత పనుల ద్వారా చెరువుల లోతు పెరిగి నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు కూలీలకు ఉపాధి, రైతులకు మేలు జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



సుబ్లేడులో చెరువు పూడికతీత పనులు

జాతరను తలపిస్తున్న చెరువులు..

మండలంలోని సుబ్లేడు, బచ్చోడు, బాలాజీనగర్ తండా గ్రామ పంచాయతీలలో అధిక సంఖ్యలో కూలీలు పనులలో పాల్గొనడంతో చెరువు ప్రాంతాలు జన జాతరలా కనిపిస్తుంది. ఈ గ్రామాల్లో ప్రతీ రోజు 350 నుంచి 400 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. మార్చి నుంచి ప్రారంభమైన ఉపాధి పనులకు ఏప్రిల్ నుంచి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నట్లు ఈజీఎస్ అధికారులు చెబుతున్నారు. మార్చి చివరి వరకు కూలీల వేతనాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. ఇప్పటివరకు కూలీలకు సగటు వేతనం రూ.250 నుంచి రూ.300 వరకు పనిని బట్టి లభిస్తుండగా.. ఎండల తీవ్రతతో కూలీలు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు పనుల్లో పాల్గొంటున్నారు. ఎండల తీవ్రత కారణంగా కూలీ రేట్లు పెంచాలని కూలీలు కోరుతున్నారు.

కూలీలు ఎక్కువగా వస్తున్నారు..



ప్రస్తుతం చేపడుతున్న చెరువు పూడికతీత పనులలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. చెరువు మట్టిని రైతులు తమ పంట పొలాలకు తరలించేందుకు ఆసక్తి చూపుతుండడంతో మంచి ఫలితాలను ఇస్తుంది.

– శేషాద్రి, ఎంపీడీఓ, తిరుమలాయపాలెం

పొలాలకు చెరువు మట్టి మంచిది..



ఉపాధి హామీ పనుల్లో చెరువు పూడిక తీత పనులు చేపట్టడం మంచిది. చెరువు మట్టితో పంటలకు కావాల్సిన పోషకాలు అంది భూసారం పెరుగుతుంది. అందుకే చెరువు మట్టిని పంట పొలాలకు తోలించుకుంటున్నాం.

– నేరడి భిక్షం, రైతు, ఎదుళ్లచెరువు

కూలి పెంచాలి..



ఈ ఏడాది ఉదయం 8 గంటలకే ఎండలు మండుతున్నాయి. రోజుకు మూడు గంటలు పనిచేసినా.. కూలి రూ.200 దాటడం లేదు. అధికారులు రోజుకు రూ.500 చెల్లించేలా చూడాలి. ఎండ తీవ్రత దృష్ట్యా కూలి పెంచాలి.

– పులకాని నాగమ్మ, ఉపాధి కూలీ, ఎదుళ్లచెరువు

కులగణనకు బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి



కూరాకులను సత్కరిస్తున్న వద్దిరాజు, నామ, తాతా, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: కులగణన, బీసీ మహిళా రిజర్వేషన్ అమలు జరగాలంటే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఎంపీలను గెలిపించుకోవాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. గురువారం ఖమ్మంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో యాదవ సంఘం ఆధ్వర్యాన డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణంకు ఏర్పాటు చేసిన సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈమేరకు రవిచంద్రతో పాటు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌లు కూరాకులను ఘనంగా సత్కరించారు. అనంతరం వద్దిరాజు మాట్లాడుతూ..బీసీ అని చెప్పుకునే ప్రధాని మోదీ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ అసెంబ్లీలో కేసీఆర్ బిల్లు చేసిన తీర్మానాన్ని పదేళ్లుగా తొక్కిపెట్టారని అన్నారు. బీసీల సమస్యలు, హక్కుల కోసం పార్లమెంట్‌లో మాట్లాడేది ఒక బీఆర్‌ఎస్ ఎంపీలు మాత్రమే అని అన్నారు. నామ నాగేశ్వరరావు వంటి బలమైన నాయకుడు పార్లమెంట్‌లో ఉంటేనే ప్రజల న్యాయమైన హక్కులకు పరిష్కారం దొరుకుతుందని, ఈ ఎన్నికల్లో ఆయనను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తిరిగి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రను యాదవ సంఘం ప్రముఖులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీపీ సునీల్ దత్

ఖమ్మంక్రైం: శాంతిసామరస్యాన్ని నెలకొల్పడం, నేరాలను కట్టడి చేసే విధులు నిర్వర్తించాల్సిన కానిస్టేబుళ్లు చట్టాలు, నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ సూచించారు. స్టయిపండరీ ట్రెయినీ కానిస్టేబుళ్లకు రెండు నెలల శిక్షణ పూర్తికాగా.. వారితో సీపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బందోబస్తు విధులు నిర్వర్తించాల్సిన ట్రెయినీ కానిస్టేబుళ్లు విధివిధానాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈసమావేశంలో అడిషనల్ డీసీపీలు గణేష్, విజయబాబు, ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

ఓటును ప్రశాంతంగా వినియోగించుకోండి



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఖమ్మంఅర్బన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యాన ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని నగర ఏసీపీ రమణమూర్తి పేర్కొన్నారు. గురువారం నగరంలోని ధంసలాపురం కొత్తూరు పరిసర ప్రాంతాలలో సెంట్రల్ పోలీస్ ఫోర్స్, స్థానిక పోలీసు సిబ్బంది కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రశాంతంగా ఓటు వినియోగించుకునేందుకు భరోసాగా ఈ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ముందస్తు ప్రణాళికతో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన బందోబస్తుకు అవసరమైన సన్నాహాలు చేపట్టామని, అందుకు పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ వారిగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడంతో పాటు నేరచరితులను బైండోవర్ చేస్తున్నామని చెప్పారు. ఎక్కడికక్కడ చెక్ పోస్టులతో పాటు పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు, బ్లూకోల్ట్ బృందాలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు భానుప్రకాశ్, ఉదయ్ కుమార్, బాలకృష్ణ, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికి ఓటరు స్లిప్పులు ఇవ్వాలి



నేలకొండపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంసీసీ యర్రయ్య

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: గ్రామాల్లో ఈనెల 30వ తేదీలోపు ఇంటింటికి తిరిగి ఓటర్లకు ఓటర్ స్లిప్పులు ఇవ్వాలని నేలకొండపల్లి మండల కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి ఎం.యర్రయ్య, ఖమ్మంరూరల్ మండలం తహసీల్దార్ బి.రాంప్రసాద్ సూచించారు. గురువారం నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులు, సెక్టోరియల్ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో యర్రయ్య, ఖమ్మంరూరల్ తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో జరిగిన సమావేశంలో రాంప్రసాద్‌లు మాట్లాడారు. ఓటరుకు స్లిప్పులు అందించే బాధ్యత బీఎల్వోలదే అని, ఏ ఒక్కరు స్లిప్పు రాలేదని ఫిర్యాదులు అందినా సహించేది లేదన్నారు. అలాగే మే 3 నుంచి 8వ తేదీ వరకు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలయ్యేలా చూడాలని బీఎల్‌ఓలను సూచించారు. కాగా, నేలకొండపల్లి మండలంలోని ఆచార్లగూడెంలో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, బోదులబండలో తహసీల్దార్ గౌరీశంకర్‌లు స్లిప్పులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశాల్లో నేలకొండపల్లి తహసీల్దార్ గౌరీశంకర్, మండల పంచాయతీ అధికారి శివ, సెక్టోరియల్ అధికారులు మన్మథరావు, ఓం ప్రకాష్, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు, ఆర్‌ఐలు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కు అందిస్తున్న చైర్మన్ హనుమంతరావు

కామేపల్లి: పీఏసీఎస్ పరిధిలోని రైతులతో పాటు వారి కుటుంబాలకు అండగా ఉంటామని మండలంలోని కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు అన్నారు. సంఘ పరిధిలోని అర్వ శ్రీను అనే రైతు మృతి చెందగా గ్రూప్ ఇన్సూరెన్స్ కింద మంజూరైన రూ.50 వేల చెక్కును గురువారం బాధిత కుటుంబానికి అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘ అభివృద్ధికి సహకరించాలని, సకాలంలో రైతులు రుణ బకాయిలను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఐతనబోయిన విఠల్‌రావు, చల్లా హరి, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను పరిశీలించిన డీఆర్‌డీఓ

తిరుమలాయపాలెం: మండలంలోని పలు ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులను డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య గురువారం తనిఖీ చేశారు. ఏపీడీ శ్రీదేవితో కలిసి పిండిప్రోలు, దమ్మాయిగూడెంల్లో పనులను తనిఖీ చేసిన ఆయన రోజు రూ.300 వచ్చేలా పనిచేయాలని సూచించారు. కాగా, పని ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆ తర్వాత దమ్మాయిగూడెంలో పల్లె ప్రకృతి వనం, నర్సరీని డీఆర్‌డీఓ పరిశీలించారు. ఉద్యోగులు నరసింహారావు, అలివేలు మంగ, అరుంధతి, మనోహర్‌రావు, మోహన్‌రావు, బాలాజీ, రాంలాల్, సలేహా బేగం తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: సామాజిక మాధ్యమాలలో మహిళలపై దాడులు – విద్యార్థుల పాత్ర అనే అంశంపై ఈ నెల 27న ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేష్ తెలిపారు. గురువారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం హయాంలో మహిళలపై దాడులు పెరిగాయన్నారు. సామాజిక మాధ్యమాల్లో జరిగే విషపూరిత ప్రచారాలను విద్యార్థులు అడ్డుకోవాలన్నారు. సంఘ నాయకులు సందీప్, శ్రీను, అనిల్, నరేందర్, లాల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

శ్రీదుర్గామల్లీశ్వరి దేవస్థానం స్వాధీనం



హుండీకి తాళం వేస్తున్న సమత

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని రామచంద్రనగర్ (మమతా రోడ్)లో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరి దేవాలయాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ వారు గురువారం రాత్రి స్వాధీనపర్చుకుంది. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ ఆదేశాలు, ఉమ్మడి ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎ.సులోచన సూచనల మేరకు ఆ శాఖ పర్యవేక్షకురాలు రెంటాల సమత ఆధ్వర్యాన ఆ శాఖ కార్యనిర్వహణ అధికారులు, మేనేజర్లు ఆలయాన్ని స్వాధీన పర్చుకున్నారు. ఈమేరకు ఆలయ ఆస్తులు, ఆలయ రికార్డులను పరిశీలించి, హుండీని తెరిచి నగదు వివరాలను పరిశీలించారు. దేవాదాయ శాఖ ద్వారా హుండీకి తాళాలు వేశారు.ఎనిమిదేళ్ల క్రితం పూర్వీకులు నిర్మించిన ఈ దేవాలయాన్ని స్థానికులు పునర్నిర్మించగా.. ప్రస్తుతం ఇందులో పనిచేస్తున్న ఇద్దరు అర్చకులు, ఒక గుమస్తా, ఒక స్వీపర్‌లను యథాతథంగా కొనసాగిస్తామని, రూపొందించిన నివేదికను పైఅధికారులకు నివేదించనున్నట్లు పర్యవేక్షకురాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖకు చెందిన కార్యనిర్వహణ అధికారులు, మేనేజర్లు, జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న తాండ్ర

ఖమ్మం మామిళ్లగూడెం: మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఖమ్మం బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. గురువారం తాండ్ర క్యాంప్ కార్యాలయంలో తల్లాడ మండల స్వతంత్ర ఎంపీటీసీ చల్లా తిరుమలదేవి నాగులు దంపతులతో పాటు వారి అనుచరులు చల్లా నవీన్, వెంకట్, రాము, కుమార్, కిరణ్, ప్రవీణ్ తదితరులు బీజేపీలో చేరగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో పాటు తాండ్ర కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా తాండ్ర మాట్లాడుతూ.. మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం..

నేలకొండపల్లి: ఖమ్మం బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని బోదులబండలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్‌గౌడ్ ఆధ్వర్యాన గురువారం రాత్రి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్, కాసాని ఉదయ్, మల్లేశం, వినోద్, ఉపేందర్, శ్రీకాంత్, గోపి, అనిల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకర్‌కు సన్మానం

నేలకొండపల్లి: ఇంటర్ మొదటి సంవత్సరంలో మూడో ర్యాంక్ సాధించిన విద్యార్థిని రుచితను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు గురువారం అభినందించారు. నేలకొండపల్లికి చెందిన దోసపాటి రామయ్య-కల్యాణి దంపతుల కుమార్తె రుచిత హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కాలేజీలో ఎంపీసీలో 466 మార్కులు సాధించింది. ఈ మేరకు రాయలతో పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఖమ్మం నగర అధ్యక్షుడు జావీద్, ఎంపీటీసీ దోసపాటి కల్పన, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు దోసపాటి శేఖర్ తదితరులు విద్యార్థినిని ఘనంగా సన్మానించారు.

9వ ర్యాంక్ సాధించిన తేజస్విని..

కామేపల్లి: కామేపల్లికి చెందిన బండి తేజస్విని ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 987 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు సాధించింది. ఈమేరకు తేజస్వినితో పాటు ఆమె తల్లిదండ్రులు గ్రామస్తులు అభినందించారు.

669 ర్యాంకు సాధించిన గిరిజన యువకుడు

కామేపల్లి: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గుగులోత్ హతిలాల్ ఎస్టీ కేటగిరిలో 669 ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా హతిలాల్‌తో పాటు ఆయన తల్లిదండ్రులను ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య

నేలకొండపల్లి: కార్మిక శ్రమను దోచుకుంటున్న బీజేపీకి వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బుద్ధి చెప్పాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఇఫ్టూ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ పాలనలో కార్మికులు, రైతు వ్యతిరేక విధానాలతో అనేక ఇబ్బందులు పడ్డారని, కార్మిక సమ్మెలపై అనేక ఆంక్షలు విధించారని, నల్ల చట్టాలతో రైతులను భూమి నుంచే వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 138వ మేడేను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల అశోక్, బాబు, సీవై.పుల్లయ్య, పి.రామదాసు, గోసు పుల్లయ్య, కె.పుల్లారావు, పి.వెంకన్న పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌కు ఇవే చివరి ఎన్నికలు'

నేలకొండపల్లి: తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ఇవే చివరి ఎన్నికలు కావాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ వాపు చూసుకుని బలుపు అనుకుంటుందని, రాజకీయంగా ఎదుర్కోలేకనే ప్రజాప్రతినిధులు, నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తుందని అన్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం పార్టీ తరపున విస్తృత ప్రచారం చేయనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు.

సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న సలీం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం శ్రీనివాసనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ షేక్ సలీంకు సామాజిక సేవా రంగంలో గౌరవ డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లోని ఏసియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ తరపున ప్రకటించిన డాక్టరేట్‌ను వీసీ డాక్టర్ ఎం.జున్ను రామశర్మ బుధవారం అందజేశారు. రక్తదాన శిబిరాల నిర్వహణతో పాటు పలుమార్లు రక్తదానం చేయడమే కాక నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలపై అవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహించడంతో ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రకటించారు.

స్తంభించిన ట్రాఫిక్..!



చర్చి కాంపౌండ్, స్టేషన్ రోడ్ ప్రాంతంలో నిలిచిపోయిన వాహనాలు

ఖమ్మంక్రైం: నగరంలోని మయూరిసెంటర్ బ్రిడ్జిపై గురువారం భారీ ర్యాలీ ఉండడంతో ట్రాఫిక్‌ను పోలీసులు కరుణగిరి బ్రిడ్జి, చర్చి కాంపౌండ్ బ్రిడ్జి మీదుగా మళ్లించారు. అయితే చర్చి కాంపౌండ్ బ్రిడ్జిపై ఓ లారీ మధ్యలో ఆగిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీంతో వాహనదారులు స్టేషన్ రోడ్ వైపు రావడంతో మధ్యగేట్ ప్రాంతంలో వాహనాలతో ట్రాఫిక్ స్తంభించింది. అదే సమయాన ఐపీఎస్ అధికారి అవినాష్‌కుమార్ వాహనం కూడా మధ్యగేట్ ప్రాంతంలో ఇరుక్కుపోవడంతో ఆయన తన భద్రతా సిబ్బందితో ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. ఆ తర్వాత చర్చి కాంపౌండ్ బ్రిడ్జిపై ఆగిన లారీని తొలగించారు. ఒక్క పక్క ఎండ మండిపోతుండడంతో పాటు వాహనదారులు ఒకరిపై ఒకరు వాగ్వాదానికి సైతం దిగారు. నామినేషన్ల ర్యాలీల అనంతరం మయూరిసెంటర్ బ్రిడ్జిపై ట్రాఫిక్ పోలీసులు అనుమతి ఇవ్వడంతో రెండు గంటల తర్వాత ఖమ్మంలో ట్రాఫిక్ సమస్య తొలగింది.